


ఏమిటీ ప్రశ్న?

*

పెన్షన్ హోల్డర్:–నాకు ఆరడజను బనియన్లు కావాలి

"చిత్తం; సైజు యేమిసైజండి?"

"ఏమిటా ప్రశ్న, అవి సరిపోయేంతవరకు నాకు సైజుతో ప్రసక్తిలేదు. సైజు సైజు, సైజుతో యెవరికిపని!

# త్రిశంకు పార్టీ

* శ్రీ. కె. వి. ఆర్. పట్నాయక్, బి. ఏ. *

ముకుందరావు ఒకపిల్ల జమీందారు. సాలీనా గవర్నమెంటువారికి చెల్లించవలసిన ముడుపుపోను మిగిలినది తన సిగరెట్లకైనా చాలకపోయినా యితర జమీందారుల్లాగ తన పేరుకూడా విశ్వవిఖ్యాతం చెయ్యాలనే కోరిక, చూలింతరాలి కోరికలాగ అయన్ని అహోరాత్రులు బాధిస్తూవుంది. ఈకోరిక నెరవేర్చుకోడానికి సాధనం యేమిటో తోచక ఈజీచైరులో జేరబడి సిగరెట్టు కాలుస్తూ తన క్రాపింగుతరంగాల్ని అనుకరిస్తూ బయలుదేరిన పొగమేఘములకేసి వింతగా చూస్తూ దీర్ఘాలోచన చేస్తున్నాడు. సిగరెట్టు ప్రభావం చేత చిన్నప్పుడు చదువుకొన్న వేమనయోగి పద్యములు జీర్ణమునకు వచ్చుటచే కాబోలు ఒక్కసారిగా ప్రపంచ తత్వాన్ని సంగిరి బింగిరిచేసే కవుల్లాగ ఆవేశాపరుడై "పదుగురాడు మాట పాటియై చెల్లుధరణిన్" అని ఉగ్రభైరవిరాగంలో ఆలాపన మొదలుబెట్టాడు.

"క్రమంబైన అక్రమంబైనన్" అని తన ఆసు కవిత్వ ప్రభావం అచ్చుపడేలాగున ఝంఝా మారుత

రాగంలో పూర్తిచెసేడు విశ్వం,-నారదుడు రంగంలోకి ప్రవేశించినట్లు గావచ్చి. ముకుందరావు తన వాయు నిర్మాణ సౌధములనుండి దిగివచ్చి విశ్వంకేసి ఒక్క సినీమాచూపు పారేసి 'గ్రీట్' చేసేడు.

విశ్వం:—.....................

ముకుం:—విశ్వం! నీవు ఆడే మాటలన్నీ వింత గాను, 'సినికల్' (Cynical) గానే వుంటాయోయ్ ఎప్పుడున్నూ.

విశ్వం:—మన రోజువారీ ప్రపంచములోని విష యములన్నిటిలోని సారాంశమే యిది. ఇదే వేమనగారి సిద్ధాంతంక్రింద చలామణి అవుచున్నది. ఎక్కడేనా ఎటువంటిపనైనా అవలీలగా అమలులో పెట్టుటకు మెజారిటీయేగా కావలసింది. అందుకోసమే ఆధు నిక ఆంగ్లకవులు Majority is the rule wherever you go అని అన్నారు. అల్లాగే జర్మనీహిట్లరు, యిటలీ ముసోలినీ, మన ఆంధ్రహిట్లరు, వారుద్దేశించిన కార్యములు నెరవేర్చుకుంటున్నారు కదూ!

ముకుం:-నేను యీపక్షనాయకు లందరిని ప్రేమి స్తాను. వీరియొక్క ఆదర్శములు చాలా బాగుం టున్నాయి. వి రేదేశాన్ని వుద్ధరించుటకు కంకణము కట్టుకున్న మహాత్ములు అందరు వీరికి సహాయము చెయ్యాలనే నా వుద్దేశం.

విశ్వం:-నీకుకూడా అధికారకాంక్ష వున్నట్లు కనబడుచున్నావే. అలాఅయితే వారందరికీ సహాయము చేస్తూ వారివెనకాతల హాంగు చేయడంవల్ల నీకేమీ మోక్షంలేదే? నువ్వు ప్రప్రథమములో ఒక పక్షనాయ కుడివి కావలె దీనికి అట్టేడబ్బు కావాలని భయప డొద్దు. నీకున్న ఆచిన్న జమీందారీపైని అప్పుదొరుకుతే మంచి మాటే, లేకపోతే ఎలానో వొక లాగున డబ్బు తెచ్చి పార్టీని లేవదియ్యి. ప్రచారం జోరుగా జరుగు టకు ఒక పత్రిక ప్రచురించు; అందులో మాత్రం ఆత్మ స్తుతి వుండవలె సుమా! యితరపార్టీలను యితరపార్టీ నాయకులను బాగుగా తిట్టాల. నీపార్టీ యొక్కటే యీ జగాన్నంతా వుద్ధరిస్తుందని వ్రాస్తుండాలి. లేకపోతే నీపక్షానికి ప్రాముఖ్యంరాదు.

ముకుం:-అయితే ఒకపార్టీకి నాయకత్వం వహించడానికి సమర్థుణ్ణి అనే అంటావేమిటి?

విశ్వం:-అదేవిటోయ్ కేవలం ఆంజనేయమూర్తి లాగే సంశయిస్తున్నావు! ముమ్మాటికి సమర్థుడవే. యిప్పుడు మనకు ఏడే పార్టీలు వున్నాయి. హిందూశాస్త్రప్రకారం రోదనశబ్దం ఏపార్టీకీ జయ కరముకాదు. గనుక నీకుకూడా అధికారకాంక్ష వున్నది కాబట్టి, ఒకపక్షం లేవదీస్తే యీరోదనశబ్ద పిశాచమును పోగొట్టిన మహాఘనుడవవుతావు. నీపేరు చాల పత్రికలలో మారుమ్రోగుతుంది.

ముకుం:-నీ సంభాషణచాల Pessimisticగా వుందే !

విశ్వం:—(ఆలోచించి) ఆఁ! నాయకుడికి వుండ వలసిన లక్షణాలు నీలో పూర్తిగా వున్నాయి. నీవు ఏదైనా పక్షాన్ని లేవదీస్తే, చాల అమోఘంగా పని చేస్తుంది. నేను యీ యావద్భారత ప్రజలతరఫున నిన్ను హెచ్చరిస్తున్నాను. నీవంటి ఘనతమమైన పురుషులు బయల్దేరుతేనేగాని యీదేశానికి మోక్షంలేదు.

ముకుం:—అయితే పార్టీపేరు దాని ఆదర్శములు కూడా నీవే చెప్పి వెయ్యి.

విశ్వం:—అల్లా దారిలోకిరా! పార్టీఆదర్శముల కేమిగాని కావలసినన్ని కాగితములు నింపవచ్చుగాని పార్టీ టైటిలుకు కొంచము అలోచించవలసి వున్నది. 'ఇంగ్లీషు' వకాబ్యులరీ (Vocabulary) అంతా చాల మట్టుకు యిదివరకే యీపార్టీల పేర్లకు ఖర్చు అయిపో

యింది. మనకు సరిపడిన మాట దొరకనట్లుంది యింగ్లీలో.

ముకుం:-(తెల్లబోయి)...ఆఁ..............

విశ్వం:-ప్రజల నుద్ధరించే సంఘం అందామంటే పిఠాపురం మహా రాజావారు ప్రయోగించేరు పీపుల్సు పార్టీ జనవాణి అనే మారుపేరుతో. యిక న్యాయాన్యాయ విచక్షణ పార్టీ అందామంటే బొబ్బిలిరాజాగారి నాయకత్వం క్రింద జస్టిస్ అని పేరు వ్యవహరింప బడు చున్నది. కాంగ్రెస్, నేషనలిష్టు. సోషలిష్టు, రివల్యూషనిష్టు అని యిదివరకుండనే వున్నాయి. కాపిటలిస్టులు, ఇండి పెండెట్ పార్టీ అని పేరు పెట్టుకొన్నారు.

ముకుం:-అయితే మరేమిటి దారి. నా పేరు పైకి రావడానికి యే మీా సూచనలు లేవన్న మాటే.

విశ్వం:-(దీర్ఘముగా ఆలోచించి) ఫరవాలేదు. స్ఫురణకు వచ్చింది. త్రిశంకు పార్టీ అని ఎచ్చటను, యేదేశములోనూ వున్నట్లు లేదు. గనుక అది నీ నాయకత్వాన్ని ఆ పేరుతో చలామణి అగుటకు చాల బాగుగా వుంటుందని తోస్తుంది. దానినే ఇంగ్లీషు పత్రికలో No Aim Party అని వాడితే సమంజసంగా వుంటుంది.

ముకుం:-Thank God! అవునోయి. అది చాలా ఫస్టుక్లాస్ గా వుందోయి. రాజర్షి విశ్వామిత్రుని వలన త్రిశంకునకు స్వర్గము ఏలాగు ప్రాప్తించినదో ఆ మాదిరిగనే మన పక్షమువారికి కూడా మోక్షము కలుగును.

విశ్వం:-అందులోను Optimism గనుక సరిపోతుంది.

ముకుం:-సరే,ఒక కొఱత తీరినది గాని ప్రచారం చేచడం యిన్ని పార్టీలమీాద కష్టమేమో అని భయముగా వున్నది.

విశ్వం:-అన్నిటికంటె ప్రచారమే సులువు. ఎందుచేతనంటే నీవద్ద ధనమనే పెద్ద ఆయుధము వున్నది. ప్రతిపట్నం, పల్లెటూరు ప్రయాణము చేయాలి. నీకు ప్రతిగ్రామములోను వుత్సవములు చేస్తూవున్నట్టు, ప్రజలు నిన్ను పొగడుచున్నట్టు, వారు నీ నాయకత్వం కొరకు ఎదురుచూచుచున్నట్టు పత్రికలలో నీవు ప్రచురణ జరిగేటట్టు ప్రథమ ప్రయత్నం చేయవలె. ఇందుకు ముందుగా నెలజీతగాళ్లను. కొందరు అనుచరులతో నీవు వెళ్లబోయే గ్రామముకు ముందుగా కొందరిని పంపించి వారిచే పుష్పమాలాలంకృతుడవగుచుండవలె. నీ యీా కార్యమునకు నిరుద్యోగసోదరులు తప్పకుండా సహాయం చేస్తారు. అందువల్ల నిరుద్యోగ సమస్య కూడా కొంతవరకూ పరిష్కారంచేసిన వాడవవుతావు. అదియునుగాక మన ఆంధ్రులు ఆరంభశూరులు. నూతనాభిమానులు గనుక వారు తప్పక నిన్ను, నీ ఆదర్శములను ఆమోదించి నీకు జయం చేకూర్చుటకు తోడ్పడుతారు.

ముకుం:-ఆంధ్రలోకంలో ఎప్పుడూ భయం లేదోయ్.

విశ్వం:-యిక మిగిలినది దక్షిణదేశం. వారు కేవలం రజిత లోహాభిమానులు గనుక నీకు ప్రచండ విఖ్యాతి చేకూర్చెదరు. వారు లేనిద్వీపము, ద్వీపకల్పములేదు. భగవంతుడు కలియుగములో ఆరూపమున శంఖచక్రములు గరిటెగా మార్చుకొని అవతరించాడు. వారు ఎల్లప్పుడును నీరునుకూడ ధనముగా మార్చుటకు ఆలోచించెదరు గనుక, తప్పక నీవు వారిని సులువుగా జయించగలవు. ముఖ్యంగా నీవు ప్రచారంలో గమనించవలసిన విషయము: డబ్బుకు ముందు వెనుక లాలోచించకూడదు. ప్రతిచోటను యితర నాయకులయొక్క చిమతలకాయలంత లోటుపాటులను కొండంతలుగాచేసి చెప్పు ఉపన్యాసకులు వ్యాసకారులు పార్టీకిమాత్రము కావలె.

ముకుం:-ఆశయాలు కూడా చెప్పితే యింక రేపటినుంచే నాపని నేను చూచుకుంటాను.

విశ్వం:-అయితే కాగితం కలం తీసి 'నోట్' చేసుకో చెప్తా ఒకటి...,

(1) మా పక్షములో మెంబరుగా చేరువారికి ప్రవేశరుసుము లేదు. ఎట్టివారినైననూ జాతి మగ, ఆడ, విచక్షత లేకుండా మెంబర్లుగా తీసికుందుము. అయినను ఆడజాతికి ఎక్కువ ప్రిఫరెన్సు యివ్వబడును.

(2) మెంబర్లుగా జేరగోరువారు యితరులను తిట్టు శక్తిగలవారలుగ నుండవలెను.

(3) ప్రతి మెంబరుకు మాపత్రిక లుచితముగా పంపబడును.

(4) మా ఏజంట్లను గౌరవించువారిని సదుచితముగా బహూకరింతుము.

(5) మా పార్టీ మెంబర్లందరకునూ ఏదోవిధముగ అధికారపదవు లిప్పించుటకే తోడ్పడెదము గావున అధికారకాంక్ష గలవారు మాసంఘంలో జేరవలెనని హెచ్చరించుచున్నాము.

(6) మేము విదేశీవస్తువులను బహిరంగముగా ముట్టము.

(7) హరిజనోద్ధరణ మాకు చాలా ఆదరణీయము

(8) శ్రీవారి ముఠాలోకి యితర పార్టి నాయకులను రాకుండ చేయవలసిన ఏర్పాటులు మెంబర్లు చేయుచుండవలె ననునది ముఖ్యోద్దేశం. యితర నాయకుల విషయంలో మెంబరుచేసిన కట్టుదిట్టములన్నియు ఎట్టి నీచములైనను శ్రీవారు ఆమోదించినట్లే ప్రజలు గుర్తెరుగవలయు.

ఇట్లు,

ముకుందరావు.

వలయువారు:—

బ్రహ్మశ్రీ నల్లేరు ముఠా జమీందారువారైన మహారాజరాజరాజబిరుదాంకితులైన శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ ముకుందరావుగారికి.

రవానా:—పొల్లేరు పాచిపెరడు పోష్టు అని వ్రాయవలెను.

ముకుం:—చాలా బాగుందోయి ముందర డబ్బు ప్రయత్నం అవశ్యం చెయ్యాలి గనుక నేను పోతాను. గుడ్ నైట్!

